# ఫిఫ్టీ - ఫిఫ్టీ

ఇంటి ముందు స్కూటరు స్లో చేశాడు ఆనంద్. పద్మ దిగి గేటు తీసింది. ఆనంద్ స్కూటర్ పార్కు చేసి వచ్చే సరికి. పద్మ ఇంటి తలుపు తీసింది. ఇద్దరి మొహాల్లోనూ ఆఫీసులో పనిచేసి వచ్చిన అలసట కన్పిస్తోంది.

గదిలో కుర్చీలో కూర్చుంటూ "పద్మా కాఫీ" అన్నాడు ఆనంద్.

పద్మ మనస్సులో లావాలా ఉబికిన కోపం వాక్ప్రవాహంగా మారింది.

"రోజూ నేనే కాఫీ చెయ్యాలా? ఏం నేను మాత్రం ఆఫీసులో పని చెయ్యడం లేదా? నీతో సమంగా సంపాదించడం లేదా? మీ మగవాళ్లంతా ఇంతే. ఇంట్లోనూ, బయటా చాకిరీ మొత్తం మేమే చెయ్యాలి. మీరు కాలిమీద కాలేసుకుని కూర్చుని ఆజ్ఞలు జారీ చేస్తారు."

ఆనంద్ మాట్లాడలేదు.

"ఇదొక్కటి బాగా తెలుసు నిమ్మకు నీరెత్తినట్లు కూచోడం" తనకీ కాఫీ త్రాగాలని ఉండడం వల్ల కాబోలు పద్మ వంటింట్లోకి వెళ్లింది. ఆమె కాఫీ ప్రయత్నంలో చేసే గిన్నెల చప్పుడుతో ఆమె విసుర్లు కూడా ఆనంద్‌కి విన్పిస్తూనే ఉన్నాయి.

"పోనీ పని రాదా అంటే బ్రహ్మాండంగా వంట చెయ్యడం కూడా వచ్చునంటాడు. మరి ఓ పూట వంట చెయ్యొచ్చుగా, బాధ్యతలన్నీ నేను పంచుకోవాలి. హక్కులుమాత్రం తనకే ఉండాలి."

నిజమే తనకు వంట బాగా వచ్చు. పెళ్లికి ముందు నలుగురైదుగురు స్నేహితులు కలిసి ఆఫీసుకి దగ్గరగా గది తీసుకుని ఉండేవారు. హోటల్లో రోజూ తినడానికి జీతం సరిపోయేది కాదు. మామూలు మెస్సుల్లో తింటే జిహ్వ చచ్చిపోయేది. నలుగురూ ఆలోచించుకుని వంటల పుస్తకాలూ, సామగ్రీకొని వంట మొదలెట్టారు. మొదట్లో రుచిగా లేక కష్టమనిపించినా, తరువాత బాగా వండుకోడం వచ్చింది. ఆఫీసుకి దగ్గర్లో రూం ఉండడంతో, ప్రొద్దుటా, సాయంత్రం పని కూడా కష్టమనిపించేది కాదు.

ఆనంద్‌ని ఆలోచనల నుంచి బయట పడేస్తూ "ఇదిగో కాఫీ" అంటూ పద్మ గొంతూ, టేబిల్‌మీద ఠపీమంటూ పెట్టిన కాఫీ గ్లాసు చప్పుడూ ఒకేసారి మోతలా విన్పించాయి.

కాఫీ రుచి పద్మ మూడ్‌లాగే ఉంది. ఆనంద్ ఏం మాట్లాడకుండా కాఫీ తాగేశాడు. పద్మ గ్లాసులు తీసుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది. ఆమె వంట చేస్తున్నంత సేపూ ఆనంద్ ఆలోచిస్తూనే కూచున్నాడు.

రాత్రి భోజనాల దగ్గర అతను మాట్లాడేడు. "సాయంత్రం నువ్వు చెప్పింది చాలా నిజం పద్మా. మన పెళ్ళయిన నాలుగు నెలల్లోనూ నేను చాలా స్వార్థంగా ప్రవర్తించేను. బాధ్యతలన్నీ నీవీ, హక్కులన్నీ నావీ అన్నట్లుగా ఉండకూడదు. రేపటి నుంచి అన్ని విషయాలలోనూ ఫిఫ్టీ.. ఫిఫ్టీగా ఉందాం."

పద్మ ముఖం వికసించింది.

"నువ్వు చెప్పినట్లుగా నాకు వంట పనీ, ఇంటి పనీ అన్నీ వచ్చు. ఒక వారం మొత్తం పని నువ్వు చెయ్యి ఒకవారం మొత్తం పని నేను చేస్తాను. అలాగే ఇంటి ఖర్చు కూడా సమంగానే పెట్టుకుందాం. నా జీతం కన్నా నీజీతమే ఎక్కువనుకో. అయినా ఇద్దరం సమంగానే పెట్టుకుందాం. నువ్వు ఇంటిపని గురించే చెప్పేవు కానీ నా ఉద్దేశ్యంలో నేను నా స్నేహితులకీ, సినిమాలకీ, సిగరెట్లకీ ఎక్కువ ఖర్చు చేస్తున్నానేమో అని అనుమానంగా ఉంది."

పద్మ ఆనందం పట్టలేక "కరెక్టే ఇన్నాళ్ళకి సరిగ్గా ఆలోచిస్తున్నావు" అంది.

"ఇంకో మాట. మా ఫ్రెండ్ ఒకతనికి మూణ్ణెళ్ళు ఆడిట్ డ్యూటీ పడింది. అతని స్కూటర్‌ని తెచ్చి నీకిస్తాను. ఎందుకంటే మీ ఆఫీసు ముందయిపోతుంది కదా. నేను వచ్చేదాకా వెయిట్ చెయ్యడం ఎందుకు? నువ్వు ముందు వచ్చేయచ్చు హాయిగా. నువ్వు ముందు వచ్చినా సరే ఏపనీ చెయ్యద్దు. నా వంతు వారంలో నేను పని చేస్తాను. ఇంటి పనీ, ఇంటి ఖర్చూ అన్నీ సమంగానే స్వీకరిస్తాను. ఒకే."

ఆనందం అవధులు దాటగా పద్మ అతని దగ్గరగా వచ్చి, గట్టిగా కౌగలించుకుని, "యూ ఆర్ ది మోస్ట్ ఎక్సలెంట్ హస్బెండ్. మా ఫ్రెండ్స్ మొగుళ్ళు వాళ్ళ కంచాలైనా వాళ్ళు పెట్టుకోరుట" అంది.

ఆనంద్ చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

❖ ❖ ❖

మర్నాడు ప్రొద్దుట పద్మ బద్ధకంగా నిద్రలేచేసరికి వంటింట్లో నుంచి చప్పుడు వినిపిస్తోంది. ఆమెకి ఎంతో హాయిగా అన్పించింది. ముందు తన ఇల్లుని చక్కబెట్టుకుంటే తర్వాత తన ఫ్రెండ్సు భర్తలకి బుద్ధి చెప్పొచ్చు. ఆపైన మహిళలందరికీ సమాన హక్కులు సాధించవచ్చు.

పద్మ మొహం కడుక్కుని వచ్చేసరికి ఆనంద్ ఆమెకు కాఫీ ఇచ్చేడు అతను కాఫీ తాగుతూ పేపర్ చదువుతూంటే పద్మ "కాఫీతో సరిపెట్టేద్దామనుకుంటున్నావా? పేపర్ చదువుతూ కూచుంటే వంట ఎవరు చేస్తారు" అంది.

ఆనంద్ పేపర్‌లోంచి తల తియ్యకుండానే మాట్లాడేడు.

"అనుమానం ముందూ, ఆడవాళ్ళు తర్వాతా పుట్టేరంటారు. నేను మొత్తం పనిచేస్తానని చెప్పేక చెయ్యనని ఎలా అనుకున్నావు? కుక్కర్‌లో అన్నం, పప్పు, కూరా పెట్టేను. కుక్కర్ విజిల్ వచ్చేసరికి నా పేపర్ చదవడం అయిపోతుంది."

పద్మ అతని ప్లానింగుకి ఆశ్చర్యపోయినా పైకి మాట్లాడలేదు.

ఆమె గుమ్మంలోకి వచ్చేసరికి రెండో స్కూటరు కూడా పోర్టికోలో కన్పించింది. "అబ్బా అంతా పకడ్బందీగానే చేస్తున్నాడే. నాలుగురోజులు పని చేసేసరికి తెలిసివస్తుంది" అనుకుందామె.

ఆఫీసుకి బయల్దేరేముందు ఆనంద్ భార్యతో, "నువ్వు స్కూటర్ మీద వెళ్ళలేకపోతే చెప్పు. ఎప్పటిలా నేనే దింపుతాను", అన్నాడు.

పద్మలో పౌరుషం ముంచుకొచ్చింది. "మీ ఆడవాళ్ళంతే. అన్నిటికీ మాతో పోటీపడతారు కానీ ఏమీ చెయ్యలేరు" అనాలని ఉంది కాబోలు.

"అవసరం లేదు. నాకు స్కూటర్ డ్రైవింగు అలవాటే" అంది ముక్తసరిగా.

❖ ❖ ❖

నాలుగు రోజులు గడిచేయి. ప్రొద్దుటే లేచి పాలపాకెట్లు తీసుకోడం దగ్గరనుంచీ రాత్రి వంటిల్లు సర్దడం వరకూ ఆనంద్ చేస్తున్నాడు. అతని ముఖంలో అలసట స్పష్టంగా కన్పిస్తోంది. కానీ పైకి మాత్రం చిరునవ్వుతో, ఏ మాత్రం విసుగూ కన్పించకుండా పని చేస్తున్నాడు.

స్కూటర్ డ్రైవింగు కష్టంగా ఉన్నా ఇంకే పనీ లేకపోవడం వల్ల పద్మకి హాయిగా ఉంది. భర్తమీద జాలివేసింది కూడా. కొంచెం పొగడ్తలందిస్తే అతనికి రిలీఫ్‌గా ఉంటుందేమో పాపం.

"ఆనంద్, నిన్ను చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆడవాళ్ళకన్నా సునాయాసంగా పనంతా చేస్తున్నావు. వంట కూడా రుచిగా ఉంది. వెరీగ్రేట్."

ఆనంద్ సన్నగా నవ్వేడు.

"ఇదేమంత పని. ఇంట్లో గ్యాసూ, కుక్కరూ, మిక్సీ అన్నీ ఉన్నాయి. పని మనిషి ఉంది. ఇద్దరికి వంట. నా పూర్వాశ్రమంలో అయితే మామూలు గిన్నెలతో, కిరసనాయిలు స్టవ్‌మీద అయిదారుగురికి వండేవాణ్ణి తెలుసా. మేం ఫ్రెండ్సంతా జోక్సు వేసుకునే వాళ్ళం. ఉద్యోగం పోయినా ఫరవాలేదు. వంటలు చేసుకుని బతికెయ్యొచ్చని."

పద్మ భోజనం పూర్తి చేసి చెయ్యి కడిగేసుకుని వెళ్ళిపడుకుంది.

❖ ❖ ❖

రెండు రోజుల తర్వాత ఇద్దరికీ జీతాలందేయి.

"ఇదిగో నా జీతంలో పదిహేను వందలు. బీరువాలో పెడతున్నాను. ఆ డబ్బు ఇంటి ఖర్చుకి. మిగతాది నా ఆఫీసులో ఖర్చులకీ, చిన్న చిన్న సరదాలకీ"

ఆనంద్ బీరువాలో డబ్బు పెట్టగానే పద్మ కూడా పదిహేనువందలు బీరువాలో పెట్టి "ఫరవాలేదులే సొంత ఖర్చుకి వెయ్యి రూపాయలున్నాయి" అనుకుంది.

మర్నాడు ప్రొద్దుటే ఇంటి యజమాని అద్దె కోసం వచ్చాడు. ఇంటి అద్దె, కరెంటూ, నీళ్ళకీ కలిసి వెయ్యి రూపాయలు తీసి ఇచ్చింది పద్మ. పని మనిషి వంద రూపాయలు జీతం పట్టుకుని వెళ్ళింది. ఆనంద్ నెలకి సరిపడా కిరాణా సామాన్లూ, రేషన్ సరుకులూ పట్టుకొచ్చాడు. కిరాణా సామాన్లలోనే తన క్రీములూ, పౌడర్లూ వంటి అలంకార సామగ్రి కూడా ఉంది. ఆనంద్ తననే కొనుక్కోమనలేదు నయం.

రాత్రి భోజనం చేస్తూ "రేపటి నుంచీ నువ్వు పని చెయ్యాలి" అన్నాడు ఆనంద్. "గుర్తుంది" అంది పద్మ కటువుగా.

❖ ❖ ❖

మర్నాడు ప్రొద్దుటే లేచి పద్మ పని మొదలెట్టింది. వారం రోజులుగా అలవాటు తప్పిపోయిన పని. విసుగ్గా ఉంది.

అదరాబాదరాగా పని పూర్తిచేసిన పద్మకి స్కూటర్‌ని చూడగానే నీరసం ముంచుకొచ్చింది. "అబ్బా ఇప్పుడు ఈ ట్రాఫిక్‌లో పది కిలోమీటర్లు నడపాలా? పెళ్ళికి ముందు ఆఫీసుకి స్కూటర్ మీద వెళ్ళిన మాట నిజమే. అప్పుడు పుట్టిల్లూ, ఆఫీసూ దగ్గరగా ఉండేవి. ఇంటి భారమంతా అమ్మ చూసుకునేది. గత వారమంతా ఆనంద్ ఇంటి పని చెయ్యడం వల్ల స్కూటర్ డ్రైవింగు కష్టం తెలియలేదు. ఇప్పుడు ఎలాగరా బాబూ"

అంతలోనే పద్మ ధైర్యం తెచ్చుకుంది.

ఛ వారం రోజులుగా పని చెయ్యక అల్సిస్తోంది. కానీ పెద్ద కష్టమేమీ కాదులే. నాలుగు రోజులకి అలవాటయిపోతుంది. పనిచేస్తే ఇంకో వారం రెస్టు తీసుకోవచ్చు. మగవాళ్ళూ, ఆడవాళ్ళూ సమానమని చాటి చెప్పాలంటే కొంత కష్టం తప్పదు.

పద్మ స్కూటర్ స్టార్ట్ చేసి నడపడం ప్రారంభించింది. కొంత సేపటికి పెట్రోలు రిజర్వ్‌లోకి వచ్చిందని తెలిసింది.

దారిలో పెట్రోలు బంకుదగ్గిర ఆగి లెక్కకడితే వారానికి నాలుగు లీటర్లయినా పోయించాలని తేలింది.

పెట్రోలు పోయించి స్కూటరు ఇచ్చినట్లున్నాడు ఆనంద్. అందుకే ఇన్నాళ్ళూ అవసరం రాలేదు. నాలుగు లీటర్లు పోయించుకొని వంద రూపాయల నోటిస్తే, ఇరవై రూపాయల చిల్లరిచ్చాడు పెట్రోలు బంకువాడు.

ఇదివరకెన్నడూ పెట్రోలు ధర గురించి ఆలోచించని పద్మ గుండె గుభేలుమంది. ఆ రోజు ఆఫీసులో పద్మకి లేటు మార్కు పడింది.

❖ ❖ ❖

మధ్యాహ్నం లంచ్ టైంలో చీరలమ్మేవాడు వచ్చాడు.

పద్మకి ఆరంజి చుక్కలున్న నిమ్మపండు రంగుచీర నచ్చింది. వెల అయిదు వందలు. ఇన్‌స్టాల్‌మెంట్సులో నెలకి అరవై, ఇప్పటికే నాలుగు చీరలకి ఇన్‌స్టాల్‌మెంట్సుకి మూడు వందలు కడుతోంది. ఇప్పుడింకో చీర కొందామా వద్దా అని ఆలోచిస్తున్న పద్మతో ఆమె కొలీగ్ "తీసుకో పద్మా. ఏదో సంపాదించుకుంటున్నాం కాబట్టి కొనుక్కోగలుగుతున్నాం. లేకపోతే ఈ మొగాళ్ళు కొంటారా ఏమిటి? వాళ్ళ సిగరెట్లకీ, సినిమాలకీ తగలెడతారు కానీ" అంది.

పద్మ వెంటనే చీర తీసుకుంది.

❖ ❖ ❖

సాయంత్రం బిజీగా ఉన్న రోడ్ల మీద స్కూటర్ నడిపి ఇంటికి వచ్చేసరికి అలసటగా అనిపించి పడుకుంది పద్మ. తలనొప్పిగా ఉంది. కాఫీ పెట్టుకునే ఓపిక కూడా లేదు.

ఆనంద్ ఇంటికి వస్తూనే "పద్మా కాఫీ" అన్నాడు.

పద్మకి నిస్సారంగా అనిపించింది. కానీ గత వారమంతా అతని కాఫీ పెట్టేడు. లేచి వంటింట్లోకి వెళ్ళి కాఫీ పెట్టి ఇద్దరికీ తెచ్చింది. కాఫీలో పాలు ఎక్కువయ్యేయి. పంచదార తక్కువైంది. ఓపిక లేకపోవడం వల్ల తొందరగా స్టవ్ ఆపేసిందేమో కాఫీ చల్లగా కూడా ఉంది.

ఆనంద్ పైకి ఏం మాట్లాడకపోయినా అతని ముఖంలో విసుగు కన్పించింది.

❖ ❖ ❖

రోజులు గడుస్తున్నాయి. ఒక వారంలో ఇంటి పని లేకపోయినా నెలమొత్తం స్కూటర్ నడపడం, స్కూటర్ మీద ఇంటికి వచ్చిన వెంటనే పని చెయ్యడం పద్మకి చాలా కష్టంగా ఉంది.

పోనీ ఆనంద్‌నే ఆఫీసు దగ్గర దింపమని అడిగితే... ఛ తను ఓడిపోయినట్ల వుతుంది.

ఆలోచిస్తున్న పద్మ దగ్గరకు కొలీగ్ వచ్చి "మేడమ్, విశ్వనాథ్ మేరేజి శుభలేఖ ఇచ్చాడు కదా. అందరం కలిసి గిఫ్టు కొందామనుకుంటున్నాం. మీ కంట్రిబ్యూషన్...?" అన్నాడు.

పద్మకి సాధారణంగా ఇలాంటి కంట్రిబ్యూషన్స్‌కి పాతికో, యాభైయ్యో ఇవ్వడం అలవాటు. ఆమె హ్యాండ్‌బ్యాగు తీసింది. లోపల ఓ ఇరవై నోటూ, కొంత చిల్లరా కన్పిస్తున్నాయి. ఆమె గుండె గుభేలుమంది. ఎదురుగా కేలండరు ఇరవై ఆరో తారీఖు చూపిస్తోంది. తన చీరల ఇన్‌స్టాల్‌మెంట్స్‌కీ, పెట్రోలుకీ, సాదరు ఖర్చులకీ పోతే ఇంతే మిగిలిందా. ఇంకా నాలుగు రోజులు గడవాలి. ఇప్పుడెలా?

పద్మ తటపటాయింపుని గమనించిన కొలీగ్ "ఇప్పుడే ఇవ్వక్కర్లేదు. మీ కంట్రిబ్యూషన్ చెప్తే చాలు" అన్నాడు.

"టెన్ రూపీస్ రాసుకోండి" అంది పద్మ.

"అదేమిటి మేడమ్. ఇదివరకెప్పుడూ ఇంత తక్కువ ఎమౌంట్ ఇవ్వలేదు. మీవారంత చండశాసనులా ఏమిటి'

ఇంటిపనీ, ఖర్చూ సమంగా పంచుకుంటున్న భర్తపై నిందపడడం పద్మకి నచ్చలేదు.

"అట్టే ఆయన అభ్యంతరమేమీ లేదు."

"అయితే ఫిఫ్టీ రూపీస్ రాస్తున్నా. మీకేమిటండీ డబుల్ ఇన్‌కమ్ ఫామిలీస్. మాలాంటి వాళ్ళం ఆలోచించాలి కానీ" అంటూ వెళ్ళిపోయాడతను.

❖ ❖ ❖

రోజులు గడిచిన కొద్దీ పద్మ తనలో తను మథనపడసాగింది. ఈ స్కూటర్ డ్రైవింగ్ బాధ ఎలా తప్పుతుంది. తను ఇంటి పని చేసే వారంలో తనకి అంత అలసటగా ఉంటోందేమిటి? ఇది వరకు కన్నా ఎక్కువ శ్రమగా ఉంటోంది. దీనికి కారణమేమిటి? స్కూటర్ నడపడమేనా? అనుక్షణం ఏవైపునుంచి ఏ బండి వస్తుందోనన్న టెన్షన్‌తో నడపడం ఎంత కష్టం'

పద్మలో ఇంకో ఆలోచన కూడా వచ్చింది. ఈ ఫిఫ్టీ... ఫిఫ్టీ పంపకాలకి ముందు ఆనంద్ ఇంట్లో కొంతపని చేసేవాడు. అందువల్ల కూడా తనకి శ్రమ తెలిసేది కాదేమో.

సిటీలో బిజీ రోడ్లమీద స్కూటర్ నడిపి ఇంటికి వచ్చిన మనిషి ఒక కప్పు కాఫీ అడిగేసరికి తనెందుకు విరుచుకుపడింది?

పద్మలో ఆలోచనలు తెగలేదు.

❖ ❖ ❖

"చీరలమ్మేవాడు వచ్చాడు రా చూద్దాం" అన్న కొలీగ్‌తో పద్మ "వద్దు ఇప్పుడు కొనుక్కోను" అంది.

"అదేమిటి ఈ నెల పండుగ వస్తోందిగా"

పెట్రోలుకీ, ఇదివరకు కొన్న చీరల ఇన్‌స్టాల్‌మెంట్సుకీ పోతే అంతగా డబ్బు మిగలడం లేదు. ఆఫీసులో తాగే కాఫీ కూడా మానేసింది. అయినా కొన్ని సాంఘికపరమైన ఖర్చులు తప్పడం లేదు. చీర కొనుక్కుందుకు డబ్బు లేదు. ఆ మాట పైకి చెప్పలేదు. చిన్న అబద్ధమాడితే సరి.

"ఈసారి బయట షాపులో కొందామనుకుంటున్నాను. వీడి దగ్గరే ఎప్పుడూ కొనడం విసుగ్గా ఉంది."

కొలీగ్ వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

రాత్రి ఆనంద్ పక్కన పడుకుని "నేను రేపటి నుంచీ వంట మొత్తం నెలరోజులూ చేస్తాను. ఏ మాత్రం విసుక్కోను కూడా" అంది.

ఆనంద్ ఆమె వంక ఆశ్చర్యంగా చూశాడు.

"నిన్ను ఏమాత్రం విసుక్కోను. ఏ వస్తువు విలువైనా అది లేనప్పుడే తెలుస్తుంది. నువ్వు ఇదివరలో చేసేపనులూ, వాటిలోని కష్టమూ నాకు తెలియలేదు. వంట చెయ్యడం కన్నా స్కూటర్ నడపడం కష్టం. వంటలో చిన్న పొరపాటు వచ్చినా సద్దుకోవచ్చు, సరి చేసుకోవచ్చు, కానీ అదే రోడ్డుమీద చిన్న తప్పు అయినా ప్రాణాంతకం కదా.

అంతే కాదు. ఇదివరలోనూ నువ్వు ఇంట్లో పని చేసేవాడివి. ఆ సంగతి అప్పట్లో నాకు తెలియలేదు. మొత్తం పని భారం నామీద పడ్డప్పుడే తెలిసింది.

సినిమాలూ, సిగరెట్లూ, స్నేహితులకన్నా నా చీరలూ, సింగారాలకే ఖర్చు ఎక్కువ. ఈసారి పండగ చీరకి కూడా డబ్బు మిగల్లేదు" పద్మ గొంతులో జీర వినిపించింది.

ఆనంద్ మాట్లాడకుండా లేచి వెళ్ళి బీరువా తీసి, ఒక పాకెట్టు తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు.

పద్మ విప్పి చూసింది. ఆశ్చర్యం. కొత్తచీర. వెయ్యి రూపాయలుంటుందేమో?

ఆమె తబ్బిబ్బవుతూ "చీరకి డబ్బెక్కడిది" అంది.

"ఇంటి ఖర్చుకు పోనూ. నా జీతంలో కొంత నేనుంచుకునే వాణ్ణిగా. అందులోనుంచి కొన్నాను."

అంటే ఆనంద్‌కి సొంత ఖర్చులు చాలా తక్కువ ఉంటాయా? తనకన్నా అతని జీతం కొంచెం తక్కువే. అయినా మిగల్చగలిగేడంటే అతని సిగరెట్లకీ, షికార్లకీ తనకున్నంత ఖర్చు లేదన్న మాట.

ఆమె మనస్సులో కదలాడుతున్న ఆలోచనలను ఊహిస్తున్నట్లుగా ఆనంద్ మాట్లాడసాగేడు.

"మన పెళ్ళికి ముందు నువ్వు మీ అమ్మా, నాన్నలదగ్గర హాయిగా ఉండేదానివి. ఇంటి ఖర్చు మీ నాన్నగారు పెట్టుకునేవారు. ఇంటి పని మీ అమ్మగారు చూసుకునేవారు.

నాకు ఉద్యోగం వచ్చిననాటి నుంచీ రూంకి రెంటూ, భోజనం ఖర్చూ అన్నీ పెట్టుకుంటూ ఇంటికి కూడా డబ్బు పంపేవాణ్ణి. అందుకే పని విషయంలో కానీ, ఖర్చు విషయంలో కానీ బాధ్యత పంచుకోడంలో నాకు కష్టం లేదు."

పద్మ అర్థం చేసుకుంటున్నట్లుగా అతనివైపు చూసింది.

"అంతేకాదు మీ ఆడవాళ్లల్లో మగవాళ్ళంతా రాక్షసులనీ, వాళ్ళకి స్వార్థం చూసుకోడమే తప్ప మరో ఆలోచన రాదనీ, ఆడవాళ్ళని బానిసలుగా చూస్తారనీ భావం పేరుకుపోయింది. రంగుటద్దాలలో నుంచి చూస్తే ప్రతి చిన్న విషయమూ తప్పగానే కన్పిస్తుంది. నేను నిన్ను కాఫీ అడిగితే నీకు నేను నిన్ను బానిసలా చూస్తున్నాననిపిస్తుంది. నువ్వు స్కూటర్ వెనక కూర్చుంటే నేను నీకు డ్రైవర్నని నేనూ అనుకోవచ్చుగా."

పద్మ ముఖంలో పశ్చాత్తాపం కన్పించింది. ఆమెను అనునయిస్తున్నట్లుగా దగ్గరకు తీసుకున్న ఆనంద్ "అఫ్‌కోర్స్ మగవాళ్ళల్లో పచ్చి స్వార్థపరులూ ఉంటారనుకో. జీతమంతా విలాసాలకి తగలేసే వాళ్ళూ ఉండొచ్చు. అలాగే ఆడవాళ్ళల్లోనూ ఉండొచ్చు."

"నువ్వన్నది నిజమే. కరెక్టుగా లెక్క పెట్టుకుంటే మగవాళ్ళ జీతమే ఇంటి ఖర్చుకి ఎక్కువ ఖర్చవుతుంది. ఆడవాళ్ళు తమ సంపాదనని 'మై మనీ' అనీ భర్తల సంపాదనను

'అవర్ మనీ' అని అమెరికాలో కూడా అనుకుంటారట. ఎక్కడో ఇంగ్లీషు పత్రికలో ఒక సైకాలజీ ఆర్టికల్‌లో చదివినట్లు జ్ఞాపకం."

ఆనంద్ కాసేపు మౌనంగా ఉండి ఆ తర్వాత నెమ్మదిగా మాట్లాడేడు.

"ఫిఫ్టీ... ఫిఫ్టీ అంటే అనుక్షణమూ అన్ని విషయాలలోనూ అంతా సమంగా ఉందా అని తూకం వేసుకోడం కాదు. అటువంటి అనుమాన దృక్పథంతో బేరీజు వేసుకుంటూంటే సంసారం సాఫీగా నడిచే బండి కాకుండా పోతుంది. ఒకసారి భార్యాభర్తల బంధం తొంభై... పది కావచ్చు. మరోసారి పది... తొంభై కావచ్చు. మొత్తానికి ఇద్దరి మధ్యా సమానత్వం ఉందన్న భావం మనస్సులో ఉండాలి. ప్రతి క్రియలోనూ సమానత్వం కోసం పోటీ ఉండకూడదు. అనుకూల దాంపత్యానికి అర్థం అదే."

పద్మ అతని మాటలని పూర్తిగా అంగీకరిస్తున్నట్లుగా చూసింది.

(పల్లకి)